


హలో.. కలెక్టర్ గారూ..
డయల్ యువర్ కలెక్టర్–ఓటరు హెల్ప్ లైన్ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. 8లో



రక్తం వేరైనా కిడ్నీ మార్పిడి
నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం 8లో



వైఎస్సార్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బుధవారం ప్రాక్టీస్ ప్రారంభించింది. 8లో

న్యూస్‌రీల్

నగర అభివృద్ధికి విశాఖ పోర్టు సహకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు, సీపీ రవిశంకర్, కమిషనర్ సాయికాంత్

కంచరపాలెం: విశాఖ పోర్టుతో పాటు నగర అభివృద్ధి, సుందరీకరణకు కట్టుబడి ఉన్నామని పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో సుమారు రూ.30 లక్షలతో నిర్మించనున్న 'గేట్ వే ఆఫ్ వైజాగ్ పోర్టు' పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్‌తో కలిసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె, చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో 12 మందికి చోటు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో జిల్లాకు చెందిన 12 మందికి చోటు లభించింది. రాష్ట్ర యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.సునీల్ కుమార్, రాష్ట్ర మహిళా విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఈగలపాటి యువశ్రీ, రాష్ట్ర బీసీ సెల్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా పైడి ప్రతాప్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కటికల కల్పన, సంయుక్త కార్యదర్శిగా వియ్యపు కమలకుమారి, రాష్ట్ర మైనారిటీ సెల్ కమిటీ సెక్రటరీగా షేక్ బాబ్జి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా వీటూరి వాసుదేవ వామన రావు, కార్యదర్శులుగా బొట్టా యాద్రాజీ, కరకవలస సంతోష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.జమేష్ జార్జ్ రాజు(నాని), పోరుబంతి హరికృష్ణ, వంద్రసి రవికుమార్‌లను నియమించారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.



తాటిపూడి రిజర్వాయర్

డిసెంబర్ వరకు ధోకా లేదు..!

- ఈ వేసవికీ మహా నగరానికి మంచినీటి సమస్య లేనట్లే..
- అన్ని రిజర్వాయర్లలోనూ పుష్కలంగా తాగునీరు
- 2019కి ముందు ప్రతి వేసవి నగరవాసికి నరకమే..
- గతంలో ప్రతి రోజూ తలసరిగా 75 లీటర్లు మాత్రమే సరఫరా
- ప్రస్తుతం 85 లీటర్ల వరకూ సరఫరా చేస్తున్న జీవీఎంసీ

నాడు
అయ్యో.. వేసవి వచ్చేసింది.. సమయానికి నీరు రాదు.. వచ్చినా అరగంటైనా ఇవ్వక ముందే.. ఆగిపోతుంది.. ట్యాంకర్లు కొనుక్కోవాలి.. 2019కి ముందు విశాఖ నగరవాసుల వేసవి కష్టాలివీ..!! సమ్మర్ వచ్చేసింది.. నీటిని రోజు విడిచి రోజు ఇద్దాం.. శివారు ప్రాంతాలకు నీటి సరఫరా తగ్గించి.. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేద్దాం.. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు, కోరమాండల్‌కు సరఫరా విషయంలో జాగ్రత్త వహిద్దాం.. 2019కి ముందు జీవీఎంసీ నీటి సరఫరా విభాగాధికారుల ప్రణాళిక ఇదీ..!

నేడు
వేసవి వచ్చేసిందన్న ఆందోళన లేదు.. నీటి సరఫరాకు ప్రధాన ప్రణాళికా అవసరం లేదు.. శివారు ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరివ్వాలన్న బాధలేదు.. పరిశ్రమలకు కోత విధించాలన్న కష్టమూ లేదు.. 2019 నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఎన్నడూ లేని విధంగా జలాశయాలు నిండుకుండల్ని తలపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న వనరులతో డిసెంబర్ వరకూ ఎలాంటి ఆందోళన లేకుండా నీటి సరఫరా చేయవచ్చంటూ జీవీఎంసీ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, విశాఖపట్నం : ఏటా వేసవి వస్తే చాలు... అంతంత మాత్రంగా ఉన్న నీటి నిల్వలతో సుమారు 25 లక్షల జనాభా ఉన్న నగరానికి సరఫరా ఎలా చేయాలనే ఆందోళనతో జీవీఎంసీ అధికారులు తలకిందులుగా తపస్సు చేసేవారు. జనవరిలోనే వేసవిలో నీటి సరఫరాకు సంబంధించి ఏ విధంగా వ్యవహరించాలనే అంశంపై భారీ సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసేవారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 2014– 2019 వరకూ ఇదే పరిస్థితులు ఎదురయ్యేవి. కానీ 2019 తర్వాత మాత్రం అలాంటి పరిస్థితులకు దూరంగా ఉంది జీవీఎంసీ. కారణం.. జలాశయాల్లో కావల్సినంత నీటి వనరులుండటమే.

రోజుకు 85 ఎంజీడీల నీరు

నగరానికి రోజూ 120 ఎంజీడీల తాగునీరు అవసరం. గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో నగర ప్రజల తాగునీటి గురించి పట్టించుకోకపోవడం వల్ల.. కేవలం 65 నుంచి 75 ఎంజీడీలు మాత్రమే జీవీఎంసీ అందించగలిగేది. దీని వల్ల మిగిలిన రోజుల్లో ఇబ్బంది లేకపోయినా.. వేసవిలో మాత్రం సరఫరాకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, కొండవాలు కాలనీలకు నీటిని అందించడం గగనమే అని చెప్పుకోవాలి. దీంతో.. వేసవి ఆరంభం కాకముందే.. రోజూ చేసే నీటి సరఫరాని కుదించి.. రెండు నుంచి మూడు రోజులకోసారి అందించేవారు. కొండ ప్రాంత ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. కానీ.. 2019 తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని రిజర్వాయర్లలో పూడికలతీత, మరమ్మతులు పూర్తి చేశారు. దీనివల్ల వర్షపు నీరు నిల్వలు పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పుడు 85 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తుండటం విశేషం.

గతంలో వెలవెల.. నేడు కళకళ

వేసవి రాకముందే జీవీఎంసీకి చెందిన నీటివనరులన్నీ వట్టిపోయేవి. ఏలేరు, రైవాడ, మేఘాద్రిగెడ్డ, తాటిపూడి, గంభీరం కాల్వల ద్వారా నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు సరఫరా చేసేవారు. కానీ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఒక్క ఏలేశ్వరంలో తప్ప.. మిగిలిన రిజర్వాయర్లన్నీ.. అథమ స్థితికి చేరుకునేవి. కేవలం ఏలేరుపైనే ఆధారపడి సరఫరా చేసేవారు. కానీ.. 2019 తర్వాత వర్షాలు ఇబ్బడిముబ్బడిగా కురుస్తుండటం.. పై నుంచి వరదనీరు చేరడం వల్ల రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు ఉండటంతో జీవీఎంసీ సరఫరా విషయంలో వెనుకంజ వేయడం లేదు.



ఏలేరు రిజర్వాయర్

ప్రతి రోజూ నగరానికి అవసరమైన నీరు **120 ఎంజీడీలు**

2014–19 వరకూ జీవీఎంసీ సరఫరా చేసే నీరు **65 నుంచి 75 ఎంజీడీలు**

2019–24 వరకు జీవీఎంసీ సరఫరా చేస్తున్న నీరు **85-90 ఎంజీడీలు**

2014–19 వరకూ ప్రతి రోజూ తలసరి సరఫరా చేసిన నీరు **80-85 లీటర్లు**

2019–24 వరకూ ప్రతి రోజూ తలసరి సరఫరా చేసిన నీరు **110-115 లీటర్లు**

రిజర్వాయర్ల ప్రస్తుత నీటి మట్టాలు

రిజర్వాయర్	2018 మార్చి–12లో నీటి మట్టం	2024 మార్చి–12లో నీటి మట్టం
ఏలేరు	72.44 మీటర్లు	73.61 మీటర్లు
తాటిపూడి	260.09 అడుగులు	291.50 అడుగులు
రైవాడ	101.01 మీటర్లు	107.45 మీటర్లు
మేఘాద్రిగెడ్డ	45.9 అడుగులు	49.60 అడుగులు
గోస్తనీ	20.01 అడుగులు	23.60 అడుగులు
గంభీరం గెడ్డ	108.44 అడుగులు	122.26 అడుగులు
ముడసర్లోవ	152 అడుగులు	164.5 అడుగులు

తాటిపూడి నుంచి నీరు విడుదల



పొట్నూరు సమీపంలో చెక్ డ్యాంను పరిశీలిస్తున్న ఏఈ సురేష్

మధురవాడ : తాటిపూడి రిజర్వాయర్ నుంచి 50 క్యూసెక్కులు నీరు విడుదల చేసినట్లు జీవీఎంసీ ఏఈ సురేష్ చెప్పారు. ఈ నీరు బుధవారం నాటికి జామి సమీపంలోకి చేరిందని.. గురువారం బోని చెక్ డ్యాంకు చేరుకుంటుందని తెలిపారు. మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో నిండిన తర్వాత పంపింగ్ చేయడం సాధ్యమవుతుందని వివరించారు. జీవీఎంసీ జోన్–2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డులకు రోజుకు 8 మిలియన్ గ్యాలన్స్ తాగునీరు అవసరం అవుతుంది. ప్రస్తుతం బోని వద్ద నీటి మట్టం బాగా తగ్గింది. ఈ నేపథ్యంలో 50 క్యూసెక్కులు నీరు.. తాగునీటి అవసరాల కోసం అధికార యంత్రాంగం విడుదల చేసింది.

పుష్కలంగా నీటివనరులు



రానున్న వేసవి కాలంలో నగర ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తవు. దాదాపు అన్ని రిజర్వాయర్లలోనూ వేసవికి సరిపడా పుష్కలంగా నీటివనరులున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటితో వచ్చే డిసెంబర్ నెల వరకూ సరఫరాకు ఢోకా లేదు. వేసవిలో భూగర్భ నీటి మట్టం తగ్గుముఖం పట్టనున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన నీటిని ట్యాంకర్ల ద్వారా అందించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేశాం.

– గొలగాని హరివెంకట కుమారి, మేయర్

అద్భుతంగా సరఫరా చేస్తాం



ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో వేసవిలో అద్భుతంగా సరఫరా చేయగలం. ఎలాగూ వర్షాకాలంలో మళ్లీ నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంది కాబట్టి.. ప్రజలకు ఇబ్బంది ఎదురయ్యే ప్రసక్తే లేదు. అయినా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు పంపించాం. వేసవిలో గ్రావిటీ కారణంగా స్వల్ప ఇబ్బందులు పడే శివారు ప్రాంతాలు, కొండ ప్రాంత ప్రజలకు నీటి ట్యాంకర్లు సిద్ధం చేస్తున్నాం.

– కె.వి.ఎస్.రవి, జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఎస్ఈ

అంతర్జాతీయ స్థాయిలో విశాఖ అభివృద్ధి

- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- రూ.147 కోట్లతో 423 అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్లు, అధికారులు

డాబాగార్డెన్స్: నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో బుధవారం జీవీఎంసీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో సుమారు రూ.147 కోట్లతో 423 అభివృద్ధి పనులకు భూమిపూజ చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను మరింత అభివృద్ధి చేస్తున్నారని, పరిపాలన రాజధానిగా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. ఐటీ, పోర్టులు, ఫిషింగ్ హార్బర్, భోగాపురం ఎయిర్ పోర్టు, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఇనార్బిట్ మాల్ వంటి పలు ప్రాజెక్టులకు సీఎం శ్రీకారం చుట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే విశాఖలోనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతారన్నారు.

అభివృద్ధి పథంలో ప్రతి వార్డు

మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైవీ సుబ్బారెడ్డిల ఆలోచనలు, సూచనల మేరకు విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగరంలో 146 పార్కులను అభివృద్ధి చేశామని, పలు జంక్షన్లను ఆధునికీకరించామని, నూతనంగా 20 బస్ బేలు నిర్మించామని తెలిపారు. నగర ప్రజలకు మౌలిక వసతులు అందించేందుకు కార్పొరేటర్ల సహకారంతో ప్రతి వార్డును అభివృద్ధి చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు ఇరుగ్గా ఉండే రహదారిని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో విస్తరించామని, రూ.100 కోట్ల వరకు టీడీఆర్‌లు ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సూచనల మేరకు గిరి ప్రదక్షిణ రోడ్డును విస్తరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విశాఖ పోర్టు ట్రస్ట్ సీఎస్సార్ నిధులు రూ.28 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఉత్తర పరిధిలో ఇనార్బిట్ మాల్ ఏర్పాటు చేయడం వల్ల 25 వేల మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమూరి సతీష్, పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, జోనల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై ఇష్టం, ప్రేమతో పనిచేస్తా..

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన అభిమానులు, కార్యకర్తలు



విమానాశ్రయంలో మంత్రి అమర్‌నాథ్‌కు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు

గోపాలపట్నం/అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గాజువాక సమన్వయకర్తగా నియమితులై బుధవారం విశాఖ వచ్చిన ఆయనకు విమానాశ్రయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. కార్లు, బైక్‌లపై వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు వెంటరాగా.. భారీ ర్యాలీగా అమర్‌నాథ్ మిందిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. మంత్రి నివాసం వద్ద డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్చుతూ అభిమానులు పండగ చేసుకున్నారు. ముందుగా అమర్‌నాథ్ మింది హైస్కూల్ వద్ద తన తండ్రి గుడివాడ గురునాథరావు, బస్టాప్‌నకు సమీపంలో తన తాత గుడివాడ అప్పన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన నివాసం వద్ద తల్లి నాగమణి, సతీమణి హిమగౌరి, కుటుంబ సభ్యులు హారతులతో స్వాగతం పలికారు. అంతకుముందు ఎయిర్‌పోర్టులో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఏ బాధ్యత అప్పగించినా ఆయనపై ప్రేమ, ఇష్టంతో పనిచేస్తానన్నారు. నా తండ్రి, తాత సేవ చేసిన గాజువాక నియోజకవర్గానికి సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. నేను పుట్టి పెరిగిన ప్రాంతంలో ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఇప్పటివరకు పనిచేసిన సమన్వయకర్త చందు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు.. అందరితోనూ కలసిమెలసి ముందుకు వెళ్తానన్నారు. గాజువాకలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి.. సీఎం జగన్‌కు బహుమతిగా ఇస్తానన్నారు. విమానాశ్రయంలో అమర్‌నాథ్‌కు ఎంపీ బి.వి.సత్యవతి, సమన్వయకర్తలు ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు బెహరా భాస్కరరావు, దామా సుబ్బారావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కుటుంబ సభ్యులతో బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన వధూవరులైన కోలా అజయ్, లిఖితా శ్రీని సీఎం జగన్ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధువరులు సీఎంకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. - మహారాణిపేట

సీఎం జగన్‌కు వరుదు కల్యాణి కృతజ్ఞతలు



శాసన మండలిలో విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ వరుదు కల్యాణి బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన సీఎంకి మంచిపేరు తెచ్చే విధంగా బాధ్యతతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

- మహారాణిపేట

హలో.. కలెక్టర్ గారూ..

- డయల్ యువర్ కలెక్టర్‌కు విశేష స్పందన
- ఓటుపై సందేహాలు నివృత్తి చేసుకున్న ప్రజలు

కాలర్ : హలో.. కలెక్టర్ గారండీ..
కలెక్టర్: అవునండీ.. చెప్పండి..
కాలర్: సార్.. నేను జీడీసీపాలెం నుంచి నగేశ్ నాయుడు మాట్లాడుతున్నాను. ఓటర్ల జాబితాలో నా డోర్ నంబర్ తప్పుగా పడింది. ఈ మధ్య ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకున్నాను.. సరి చేస్తారా?
కలెక్టర్: నగేష్.. ఒక్క నిమిషం మీరు లైన్‌లో ఉండండి(కలెక్టర్ డీఆర్వోను పిలిచారు. ఎన్నికల విభాగం అధికారులు ఆన్‌లైన్‌లో వెతికి సంబంధిత వివరాలను కలెక్టర్‌కు అందించారు.) హలో నగేష్.. మీ అప్లికేషన్ తీసుకున్నాం. రెండు మూడు రోజుల్లో మీరు సూచించిన డోర్ నంబర్ మారి కొత్త కార్డు వస్తుంది. ఇలా సాగింది తొలి రోజు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం.



ప్రజలతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఓటు నమోదు, చిరునామా మార్పు, గుర్తింపు కార్డు పొందడం, పోలింగ్ స్టేషన్ వివరాలు, తదితర ఎన్నికలకు సంబంధించిన సందేహాల నివృత్తి చేసేందుకు కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి డయల్ యువర్ కలెక్టర్–ఓటరు హెల్ప్ లైన్ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. తొలిరోజు బుధవారం ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 19 మంది ఫోన్లు చేసి తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో 14 మంది ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమస్యలను తెలపగా.. మిగిలిన వారు సాధారణ సమస్యలను వివరించారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, కలెక్టరేట్ ఏవో, ఎన్నికల విభాగం అధికారులతో కలిసి కలెక్టర్ ఎ.మల్లికార్జున ఫోన్ ఇన్ ద్వారా ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను పూర్తిగా వింటూ.. వాటి పరిష్కార మార్గాలను అప్పటికప్పుడు చూపించారు.

మొదటి కాలర్ ఓటరు హెల్ప్‌లైన్ యాప్ వినియోగం, నూతన ఓటు నమోదు ఇతర అంశాలపై సందేహాలు అడగ్గా కలెక్టర్ సంబంధిత యాప్ గురించి క్షుణ్ణంగా వివరించారు. కొత్తగా ఓటు కోసం నమోదు చేసుకున్నామని, ఇంకా ఓటు రాలేదని ఎండాడ, పెదగంట్యాడ, మహారాణిపేట నుంచి ఒక్కొక్కరు కాల్ చేశారు. ఓటు నమోదు తర్వాత విచారణ కూడా చేశారని, ఇంకా ఓటు రాలేదని తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన వ్యక్తి చెప్పగా బీఎల్వోను ఇంటికి పంపిస్తామని కలెక్టర్ బదులిచ్చారు. ఓటు కోసం సచివాలయంలో నమోదు చేసుకోగా కొద్దికాలం తర్వాత క్యాన్సిల్ అని వచ్చిందని పెదగంట్యాడకు చెందిన వ్యక్తి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. తక్షణ చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. చిరునామాలో తప్పులు దొర్లాయని సరిచేయాలని విశాలాక్షినగర్‌కు చెందిన శాస్త్రి కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. బీఎల్వోను ఇంటికి పంపించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ చెప్పారు. ఒకే ఆధార్‌ను ఒకటి కంటే ఎక్కువ కరెంట్ మీటర్లకు లింక్ చేశారని, డీలింక్ చేయాలని పాత గాజువాకకు చెందిన వ్యక్తి తన సమస్యను విన్నవించుకున్నారు. అకారణంగా తన పింఛను నిలిచిపోయిందని రామ్‌నగర్‌కు చెందిన కనకరాజు కలెక్టర్ దృష్టిలో పెట్టారు. ఇలా విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన సమస్యలను విన్న కలెక్టర్.. వాటిని పరిష్కరించేందుకు తగిన ఆదేశాలు జారీ చేశారు. గురువారం కూడా మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్–ఓటరు హెల్ప్ లైన్ కార్యక్రమం జరుగుతుంది. ప్రజలు 0891–2590100ను సంప్రదించవచ్చు. ఓటర్ల జాబితాకు సంబంధించిన సమస్యలనే ఈ కార్యక్రమం ద్వారా తీసుకురావాలని.. మిగిలిన సమస్యలను స్పందనలో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ జిల్లా ప్రజలకు సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో సీపీ చొరవ

సీతంపేట: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆధ్వర్యంలో కమిషనరేట్‌లో ప్రతి నెలా 1, 15 తేదీల్లో డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గత 1వ తేదీన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ 22 మంది కాలర్స్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశించిగా.. 22లో 21 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి. వృద్ధుల ఫిర్యాదుల కోసం కేటాయించిన సమయంలో ఏడు ఫిర్యాదులు రాగా సీపీ ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించారు. 0891–2523408 నంబర్‌కు ఫోన్ చేసి గాని, 94933 36633 నంబర్‌కు వాట్సాప్ ద్వారా గాని, ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ద్వారా పోలీస్ కమిషనర్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సిటీ పోలీస్ అధికారులు తెలిపారు.

దివ్యాంగుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక స్పందన

- ప్రతి నెల 2, 15 తేదీల్లో నిర్వహణ

విశాఖ సిటీ: దివ్యాంగుల సమస్యలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు గాను పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రత్యేక స్పందన నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి నెలా 2, 15 తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య అంధుల సమస్యలు 7337324466 నెంబర్‌కు, దివ్యాంగుల సమస్యలు 7337434422 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని సీపీ సూచించారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలిని ఫిర్యాదుల స్వీకరణ కోసం కేటాయించినట్లు చెప్పారు.

16న జాబ్‌మేళా

కంచరపాలెం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్–ప్లేస్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 16న దువ్వాడలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీలో జాబ్ మేళా జరగనుంది. 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ, ఐటీఐలో ఫిట్టర్, టర్నర్, మెకానిస్ట్, డీజిల్ మెకానిక్, బీటెక్, ఎంటెక్‌లో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు అర్హులు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 నుంచి రూ.25,000 వరకు జీతం చెల్లిస్తారు. మరిన్ని వివరాలకు 92925 53352కు సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య ఓ ప్రకటనలో సూచించారు.

స్పా కేంద్రాలపై పోలీసుల దాడులు

విశాఖ సిటీ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లేకుండా నగర పోలీస్ శాఖ ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా నగరంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న స్పా, మసాజ్ కేంద్రాలపై బుధవారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేంద్రాలపై చర్యలకు సమాయత్తమయ్యారు. వీటితోపాటు నగరంలో ఉన్న లాడ్జిలు, హోటళ్లలో కూడా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు, అసాంఘిక శక్తులకు చెక్ పెట్టేందుకు రికార్డులను పరిశీలించారు. అలాగే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు చేశారు. రాత్రి వరకు ఈ దాడులు కొనసాగాయి.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- నోడల్ అధికారులతో కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్)పై శిక్షణ కార్యక్రమం బుధవారం సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వస్తుందన్నారు. ఇందుకు తగిన విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు సిద్ధం కావాలన్నారు. ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్లు, అంతర్ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలు జిల్లాలోకి ప్రవేశించకుండా తగిన బందోబస్తు చేపట్టాలన్నారు. రూ.10 లక్షలకు మించి ఎక్కడైనా నగదు పట్టుకుంటే.. ఆదాయపు పన్ను అధికారికి తెలియజేసి సీజ్ చేయాలని ఆదేశించారు. లక్షకు మించి బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసినా.. ఓ బ్యాంకు ఖాతా నుంచి అధిక సంఖ్యలో బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ జరిగినా.. అలాంటి ఖాతాలను పరిశీలించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్‌వర్మ నోడల్ అధికారులకు ఈఎస్ఎంఎస్ యాప్ వినియోగంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఎస్ఈబీ, పోలీస్, అటవీ, ఎక్సైజ్, పోస్టల్, ఆదాయపన్ను, ఎయిర్‌పోర్ట్, సీఆర్‌పీఎఫ్, జీఎస్టీ, రెవెన్యూ, ఇంటిలిజెన్స్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన ఐఏఎస్‌ల బృందం

సాక్షి, విశాఖపట్నం : ఐఏఎస్‌గా పదోన్నతులు పొందిన, వివిధ రాష్ట్రాల క్యాడర్‌కు చెందిన 16 మంది సభ్యులతో కూడిన కన్‌ఫర్డ్ ఐఏఎస్‌ల బృందం విశాఖపట్నం పోర్టును బుధవారం సందర్శించింది. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన వివరాలు, వాణిజ్య పరమైన అవకాశాలు, పోర్టులో జరుగుతున్న ఆధునికీకరణ, యాంత్రీకరణ పనులకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఇంటర్ పరీక్షకు 98 శాతం హాజరు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు ఆర్ఐవో పి.మురళీధర్ వెల్లడించారు. బుధవారం జరిగిన ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ సబ్జెక్టుకు 98 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 38,472 మంది నమోదు చేసుకోగా వీరిలో 37,845 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 627 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు

ఆరిలోవ: గీతాంజలి మరణానికి కారణమైన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. తూర్పు నియోజకవర్గ మహిళా నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కొవ్వొత్తులు పట్టుకొని బీచ్ రోడ్డులో ర్యాలీ చేశారు. అనంతరం మహిళా కార్పొరేటర్లు ఉమ్మడి స్వాతి, గేదెల లావణ్య, కెల్ల సునీత, మువ్వల లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి గురించి సంతోషంలో బాహ్యప్రపంచానికి తెలియజేసిన ఓ పేద మహిళ ప్రాణం తీయడం అమానుషమన్నారు. సోషల్ మీడియాలో ట్రోల్ చేసి చిత్ర హింసకు గురి చేయడం వల్లే గీతాంజలి ప్రాణాలు పోవడానికి కారణమన్నారు. ఆమె మరణానికి కారుకులైన వారిని వదలిపెట్టకూడదన్నారు. సోషల్ మీడియాలో ట్రోల్ చేసినవారు ఒక్కసారి ఆలోచించాలని, వారి కుటుంబంలో కూడా ఆడవారు ఉంటారని తెలిపారు. పలు వార్డుల మహిళా నాయకులు సత్యవతి, శిరీషా, కళావతి, సత్యవేణి, షకీనా, అధిక సంఖ్యలో మహిళలు, మార్కెటింగ్ శాఖ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, మధుపాడ రవి తదితరులు పాల్గొన్నారు.

51 మందికి రూ.2.17 కోట్ల రుణాల మంజూరు



చెక్కు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: పీఎం సురాజ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన 51 మందికి రూ.2.17 కోట్ల రుణాలను జేసీ కె.మయూర్ అశోక్ పంపిణీ చేశారు. 30 మందికి ఆయుష్మాన్ కార్డులు, 32 మంది పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత రక్షణ కిట్లకు అందించారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి, లబ్ధిదారులతో ముచ్చటించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జేసీ, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ లైజన్ అధికారి పి.కె.జాన్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు హాజరయ్యారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు, జీవీఎంసీ, స్త్రీనిధి, వివిధ వాణిజ్య బ్యాంకుల ద్వారా రూ.2,17,03,750 రుణాలను లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు జేసీ వెల్లడించారు.

బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్: బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది బుధవారం తీర్పు చెప్పారు. బాలికకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివీ.. నిందితుడు బొంకు రాజు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి న్యూ కాలనీ నారాయణ టవర్స్‌లో వాచ్‌మన్‌గా ఉండేవాడు. వరసకు బావమరిది అయిన నల్లి కనకరాజు.. బొంకు రాజు ఇంటికి తరచూ వస్తూ ఉండేవాడు. ఇదే అదనుగా కనకరాజు కుమార్తెతో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. బొంకు రాజు ప్రవర్తనకు నిశ్చేష్టులైన కనకరాజు కుటుంబ సభ్యులు 2021 అక్టోబర్ 19న నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన అప్పటి ఎస్ఐ ప్రమీల నిందితుడిపై ఐపీసీ 354, పోక్సో చట్టం సెక్షన్ 8 కింద కేసు నమోదు చేశా రు. నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ, హోలీ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

- ఈ నెల 16, 23, 30, ఏప్రిల్ 6వ తేదీల్లో చెన్నై ఎగ్మోర్–సంత్రగచ్చి(06077) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ చెన్నైలో, ఈ నెల 18, 25, ఏప్రిల్ 1, 8 తేదీల్లో సంత్రగచ్చి–చెన్నై ఎగ్మోర్ (06078) స్పెషల్ సంత్రగచ్చిలో బయలుదేరుతుంది. దువ్వాడ మీదుగా ఈ రైలు రాకపోకలు సాగిస్తుంది.
- ఈ నెల 19, 26, ఏప్రిల్ 2వ తేదీల్లో చెన్నై ఎగ్మోర్–సంత్రగచ్చి(06079) రిజర్వ్‌డ్ స్పెషల్ చెన్నైలో, 20, 27, ఏప్రిల్ 3వ తేదీల్లో సంత్రగచ్చి–చెన్నై ఎగ్మోర్ (06080) రిజర్వ్‌డ్ స్పెషల్ సంత్రగచ్చిలో బయలుదేరుతుంది. దువ్వాడ మీదుగా ఈ రైలు ప్రయాణిస్తుంది.
- విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్(08571) హోలీ స్పెషల్ రైలు ఈ నెల 23, 30వ తేదీల్లో ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 5.40 గంటలకు హజరత్ నిజాముద్దీన్ చేరుకుంటుంది. హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం(08572) హోలీ స్పెషల్ 24, 31వ తేదీల్లో హజరత్ నిజాముద్దీన్‌లో రాత్రి 11.55 గంటలకు బయలుదేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–పాట్నా(08517) హోలీ స్పెషల్ రైలు ఈ నెల 20, 27వ తేదీల్లో విశాఖలో ఉదయం 9.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.35 గంటలకు పాట్నా చేరుకుంటుంది. పాట్నా–విశాఖపట్నం(08518) హోలీ స్పెషల్ రైలు 21, 28వ తేదీల్లో పాట్నాలో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–సంత్రాగచ్చి(07223) హోలీ స్పెషల్ ఈ నెల 22న ఉదయం 7.05 గంటలకు సికింద్రాబాద్‌లో, సంత్రాగచ్చి–సికింద్రాబాద్ (07224) హోలీ స్పెషల్ 23న మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరుతుంది. దువ్వాడ మీదుగా ఈ రైలు రాకపోకలు సాగిస్తుంది.
- సికింద్రాబాద్–షాలిమర్(07225) హోలీ స్పెషల్ ఈ నెల 25న సికింద్రాబాద్‌లో తెల్లవారు 4.30 గంటలకు, షాలిమర్–సికింద్రాబాద్ (07226) హోలీ స్పెషల్ 26న ఉదయం 10గంటలకు షాలిమర్‌లో బయలుదేరుతుంది. ఈ రైలు దువ్వాడ మీదుగా ప్రయాణిస్తుంది.

ఢిల్లీ క్యాపిటల్స్ ప్రాక్టీస్ షురూ..



ఇషాంత్ శర్మ

విశాఖస్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) జట్టు ప్రాక్టీస్ మొదలుపెట్టింది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బుధవారం సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఆటగాళ్లు వ్యాయామంతో పాటు ప్రాక్టీస్ చేశారు. వారం రోజుల పాటు విశాఖలోనే ఆ జట్టు ప్రాక్టీస్ చేయనుంది. వైఎస్సార్ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న డీసీ తొలి రెండు మ్యాచ్‌లను ఇక్కడే ఆడనుంది. ఈ నెల 31న డిఫెండింగ్ చాంప్ హోదాలో బరిలోకి దిగుతున్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే)తో, ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్)తో తలపడనుంది. ప్రమాదానికి గురైన రిషభ్ పంత్ కోలుకుని.. చురుగ్గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు టాపార్డర్ బ్యాటర్‌గా విశాఖ కుర్రాడు రికీబుయ్ సత్తా చాటనున్నాడు.



సాధన చేస్తున్న ఢిల్లీ ఆటగాడు


స్థానిక కుర్రాడు కె.ఎస్.భరత్ కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడనుండగా.. ఆంధ్రా ఆటగాడు రషీద్ చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున విశాఖలో జరిగే మ్యాచ్‌లో బరిలో దిగనున్నాడు. ఐపీఎల్ ప్రస్తుత సీజన్ ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది.

రక్తం వేరైనా కిడ్నీ మార్పిడి

- విశాఖలోనూ ఈ తరహా శస్త్రచికిత్సలు
- మార్పిడి కంటే వ్యాధి నివారణ సులభం
- కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యుల సూచన
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

మహారాణిపేట: ఒకప్పుడు కిడ్నీ మార్పిడి చేయాలంటే సమీప బంధువుల నుంచి తీసుకోవాలి. అది కూడా ఒకే రక్తం గ్రూపు అయి ఉండాలి. లేదంటే ఎవరైనా జీవన్మృతులు అవయవదానం చేస్తే వారి నుంచి తీసుకోవాలి. కొన్ని సందర్భాల్లో ఈ రెండు మార్గాలూ కుదరవు. సమీప బంధువులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా రక్తం గ్రూపు మ్యాచ్ కాదు. అవయవదానానికి చాలా ఎక్కువ కాలం వేచి చూడాలి. ఇలాంటి సందర్భాల్లో వేర్వేరు రక్తం గ్రూపులు ఉన్న వారి మధ్య సైతం కిడ్నీ మార్పిడి జరుగుతోంది. గతంలో కేవలం పెద్ద పెద్ద నగరాల్లో మాత్రమే చేసే ఈ తరహా శస్త్రచికిత్సలు ఇటీవల కాలంలో విశాఖలోనూ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఒకటైన కిమ్స్ ఐకాన్‌లో ఈ తరహా శస్త్రచికిత్సలు విజయవంతంగా చేస్తున్నట్లు ఆ ఆస్పత్రి కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆర్.కె.మహేష్ తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

'బ్లడ్ గ్రూపులు వేర్వేరుగా ఉన్నప్పుడు రక్తం ఎక్కిస్తే ఇన్ఫెక్షన్లు వచ్చి, రియాక్షన్లు మొదలవుతాయి. అలాంటిది ఏకంగా కిడ్నీయే అమర్చడం అంటే చిన్న విషయం కాదు. అందుకోసం ముందుగా గ్రహీతలకు రక్తం గ్రూపు వేరే అయినా దుష్ప్రభావాలు రాకుండా కొన్ని రకాల మందులు ఇస్తాం. అవి వాడి, వాళ్ల శరీరం కిడ్నీ మార్పిడికి సిద్ధంగా ఉందని అనుకున్నప్పుడు.. వాళ్ల సమీప బంధువుల్లో వేరే గ్రూపు రక్తం ఉన్న వారి కిడ్నీ తీసి అమరుస్తాం. ఒకప్పుడు ఈ తరహా శస్త్రచికిత్సలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, రాయవెల్లూరు తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో మాత్రమే జరిగేవి. ఇప్పుడు విశాఖలోనూ విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ఒక్క కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోనే ఈ తరహా శస్త్రచికిత్సలు ఇప్పటికి పది పైగా చేశాం. అన్నింటిలోనూ రోగులు పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడుపుతున్నారు.' అని డాక్టర్ మహేష్ వివరించారు.



తొలి దశలోనే గుర్తించాలి

దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులు(సీకేడీ) ఒక్క రోజులో రావు. చాలా కాలం నుంచి ఉండి.. అవి తీవ్రతరం అయిన తర్వాత రోగులు వైద్యుల వద్దకు వస్తుంటారు. అప్పుడు కొన్నాళ్ల పాటు డయాలసిస్ చేసినా.. కిడ్నీ మార్పిడి తప్పనిసరి అవుతుంది. నిజానికి ఎవరైనా కిడ్నీలకు సంబంధించిన సమస్య వచ్చినప్పుడు ముందుగా గుర్తించి కొన్ని మందులు వాడటం, జీవనశైలిలో మార్పులు చేసుకుంటే మార్పిడి వరకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు. నొప్పి నివారణ మందులు ఎక్కువగా వాడటం, జిమ్‌లో కండలు తిరిగేందుకు ఎక్కువ వ్యాయామాలు చేయడం, అధిక ప్రోటీన్లు, అధిక కేలరీలు ఉన్న ఆహారాలు తీసుకోవడం, రోజువారీ ఆహారంలో ఉప్పు ఎక్కువగా వాడటం లాంటి వాటి వల్ల కిడ్నీలు దెబ్బతింటాయి. ప్రతి రోజూ నీళ్లు కూడా తగినంతగా తాగాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటించని వారికి కిడ్నీలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. వాటి లక్షణాలను గమనించి, తొలి దశలోనే వైద్యులను సంప్రదిస్తే చాలా వరకు తగ్గిపోతుంది. మార్పిడి వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదని డాక్టర్ తెలిపారు.



కిడ్నీ మార్పిడి చేయించుకున్న వ్యక్తితో డాక్టర్

ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టండి

కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తూర్పుగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. అందులోనూ శ్రీకాకుళంలోని ఉద్దానం ప్రాంతానికి చెందిన వారు ఎక్కువగా ఇక్కడకు వస్తారు. నగరంలో చేసే మొత్తం కిడ్నీ మార్పిడిల్లో దాదాపు సగం వరకు ఆరోగ్యశ్రీ, సీజీహెచ్ఎస్, ఇతర కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల బీమా పథకాలు, తదితర వాటిలో ఉచితంగా చేసేవే ఉంటాయి. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం కంటే ముందుగా జాగ్రత్త పడటం మంచిది. కాబట్టి ఎవరికి వారు తమ చేతుల్లో ఉన్న ఆరోగ్య సంరక్షణ విషయంపై దృష్టిపెట్టాలి' అని డాక్టర్ ఆర్.కె. మహేష్ సూచించారు.